సాక్షి
పెద్దపల్లి
సోమవారం, 4, ఆగస్టు, 2025





## ఆదివరాహస్వామికి మొక్కులు

కమాన్‌పూర్: స్థానిక శ్రీఆదివరాహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి బారులు తీరి మొక్కులు చెల్లించుకున్నారు.



## ఆకట్టుకున్న సాధనాశూరులు

జ్యోతినగర్: నర్రశాలపల్లిలో సాధనాశూరులు చేపట్టిన ఇంద్రజాల ప్రదర్శన ఆకట్టుకుంది. కరీంనగర్ జిల్లా చల్లూరుకు చెందిన చింత కింది శోభన్‌బాబు బృందం ప్రదర్శనలిచ్చింది.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/26.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా నమోదు అవుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### స్టేడియం నిర్మాణానికి నిధులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.30కోట్లు కేటాయించిందని ఎమ్మెల్యే విజయ రమణారావు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో స్టేడియం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించేలా చూస్తామని ఆయన అన్నారు. నాయకులు కొట్టె సదానందం, లకిడి భాస్కర్, నూగిల్ల మల్లయ్య, సరోత్తంరెడ్డి తదితరులు ఉన్నారు.

**అప్పుల్లో ఉన్నా పథకాలు అమలు**

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గత ప్రభుత్వం చేసిన అప్పులు చెల్లిస్తూనే ప్రజలపై భారం పడకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కిందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. రెబ్బల్‌దేవ్‌పల్లి, చిన్నబొంకూర్, మియ్యాపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గుపోసి మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, నాయకులు పన్నాల రాములు, సాగర్ ఉన్నారు.

### మొక్కలు నాటిన 'హర్కర'

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం వనమహోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, జిల్లా అటవీశాఖ అధికారి శివయ్య, ఎంపీడీవో వేణుమాధవ్ తదితరులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల పరి షత్ సూపరింటెండెంట్ కరుణాకర్, అధికారు లు కొమురయ్య, రమేశ్, ఇర్షద్‌బేగ్, రవంతి, లీల తదితరులు పాల్గొన్నారు.

### యూరియా ఉత్పత్తి ప్రారంభం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం ఎరువుల కర్మాగారంలో యూరియా ఉత్పత్తి ప్రారంభమైంది. కర్మాగారం అమ్మోనియా పైప్‌లైన్ లీక్ కావడంతో జూలై 16న ప్లాంట్ షట్‌డౌన్ చేసిన విషయం విదితమే. మరమ్మతులు అనంతరం శుక్రవారం ప్లాంట్ ప్రారంభం కాగా ఆదివారం యూరియా ఉత్పత్తి పునరుద్ధరించారు. కర్మాగారం యూరియా ఉత్పత్తి సామర్థ్యం రోజూ 3,850 మెట్రిక్ టన్నులు. వార్షిక మరమ్మతులు, హెచ్‌టీఆర్ మార్పుతో సామర్థ్యానికి అనుగుణంగా ఉత్పత్తి చేయలేకపోతున్నారు.

### రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సుల్తానాబాద్/ఎలిగేడు/కాల్వశ్రీరాంపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారావు ఈనెల 5న జిల్లా కేంద్రంలో పర్యటిస్తారని ఆ పార్టీ నేతలు కర్రె సంజీవరెడ్డి, కంకణాల జ్యోతిబసు, ముక్కోజు వెంకటేశ్వర్లు, చాతరాజు రమేశ్ తెలిపారు. ఆదివారం ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియామకమైన రామచంద్రారావు తొలిసారి జిల్లాకు వస్తున్నందున పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గాదె రంజిత్‌రెడ్డి, అడ్డ గుంట తిరుపతిగౌడ్, గుజ్జుల మల్లారెడ్డి, గోపు సురేందర్‌రెడ్డి, రాయపాక మనోహర్, మల్లారపు అంజయ్య, గంగయ్య, చౌదరి తిరుపతి, బత్తిని శ్రీనివాస్, రవి, కోడూరి శ్రీనివాస్, రాజేందర్, సతీశ్‌రెడ్డి, భోగె కిరణ్, ఎడ్ల సతీశ్ పాల్గొన్నారు.

### పనుల్లో వేగం పెంచండి




పనులు పరిశీలిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి చేపట్టిన ర్యాపిడ్ గ్రావిటీ నిర్మాణంలో వేగం పెంచి సకాలంలో పూర్తిచేయాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆర్జీ- వన్ ఏరియాలో జీడీకే-1వ గని ఫ్యాన్‌హౌస్ వద్ద చేపట్టిన ర్యాపిడ్ గ్రావిటీ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. కార్మిక కుటుంబాలకు నాణ్యమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో తాము పోరాటం చేశామని, దీంతోనే సింగరేణి రూ.20కోట్లతో ర్యాపిడ్ గ్రావిటీ పనులు చేపట్టిందన్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని దీనిని త్వరగా అందుబాటులోకి తేవాలని ఆయన కోరారు. నాయకులు ఆరేపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, ఆసరి మహేశ్, దాసరి సురేశ్, అనబోయిన శంకర్, సానం రవి, ఈద వెంకటేశ్వర్లు, పెరుమళ్ల శ్రీనివాస్, తిప్పారపు రాజు, జనార్దన్‌రెడ్డి, పెద్దపల్లి శశికుమార్, రాజ్‌కుమార్, శివరామకృష్ణ, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 'పత్తిపాక'కు అడుగులు

- డీపీఆర్ తయారీకి రూ.1.10కోట్లు
- 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు అవకాశం
- 10 వేల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి
- చివరి ఆయకట్టు రైతులకు తప్పనున్న సాగునీటి కష్టాలు




పత్తిపాక రిజర్వాయర్ నమూనా (ఫైల్)

సాక్షి పెద్దపల్లి: ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని జిల్లాకు అందించేందుకు ప్రతిపాదనలో ఉన్న పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సాగునీటి స్థిరీకరణ, కొత్త ఆయకట్టు కోసం ప్రతిపాదించిన పత్తిపాక రిజర్వాయర్ డీపీఆర్(డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) తయారీకి ప్రభుత్వం రూ.1.10 కోట్లు మంజూరు చేసింది. 7.78 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మించే ఈ ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తారు. అక్కడినుంచి నేరుగా కాకతీయ కాలువలోకి పంపిస్తారు. రేవెల్లి సమీప హెడ్‌రెగ్యులేటర్ ద్వారా ఎస్సారెస్పీ డీ-83, డీ-86 కాలవలకు అందిస్తారు. తద్వారా ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి, చొప్పదండి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 2.40 లక్షల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణతో పాటు, కొత్తగా సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరు సమృద్ధిగా అందించే వీలుందని అధికారులు చెబుతున్నారు.

**ప్రాథమిక అంచనాలు సిద్ధం..**

ప్రతిపాదిత పత్తిపాక ప్రాజెక్టును అధికారులతో కలిసి మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ గతంలోనే పరిశీలించారు. సమీక్షలు సైతం నిర్వహించారు. రిజర్వాయర్ ఎంత సామర్థ్యంతో నిర్మించాలి, ఎన్ని ఎకరాలు ముంపునకు గురవుతాయి? ఇందులో ప్రభుత్వ భూములు, పట్టా భూములు ఎన్ని? తదితర అంశాలపై ఇప్పటికే నీటి పారుదల శాఖాధికారులు ప్రాథమికంగా ప్రతిపాదనలు రూపొందించారు. 7.78 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మిస్తే, 1,700 ఎకరాలు ముంపునకు గురవుతాయని అంచనాకు వచ్చారు. ఇందులో 400 ఎకరాలు అటవీ, 1,300 ఎకరాలు పట్టా భూములు సేకరించాల్సి ఉంటుంది.

**గతంలో ప్రతిపాదనలకే పరిమితం**

ఎస్సారెస్పీ ద్వారా జిల్లాలో ప్రస్తుతం 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. వారబందీ పద్ధతిలో నీటిని విడుదల చేస్తుండడంతో ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, రామగిరి, మంథని, రామగుండం మండలాల్లోని చివరి ఆయకట్టుకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎస్సారెస్పీ ఆయకట్టుకు నీరు అందించి స్థిరీకరించేందుకు ధర్మారం మండలం పత్తిపాక వద్ద 1.56 టీఎంసీల సామర్థ్యంతో ఒకటి, 7 టీఎంసీల సామర్థ్యంతో మరో ప్రతిపాదనను నీటిపారుదల అధికారులు రూపొందించినా అక్కడికే పరిమితమయ్యాయి. దీనికి ప్రత్యామ్నాయంగా వరదకాలువ నుంచి ఎస్సారెస్పీ కాలువకు మధ్య 3 కి.మీ. వరకు కెనాల్ నిర్మించారు. దీంతో గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరదకాలువ ద్వారా మిడ్‌మానేరుకు నీటిని తరలించినప్పుడు మాత్రమే లింక్‌కాలువ ద్వారా సాగునీరు అందతుంది. రైతులకు శాశ్వత పరిష్కారం లభించాలంటే పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం తప్పనిసరిగా మారింది. దీంతో గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తామని కాంగ్రెస్ నేతలు హామీలు ఇచ్చారు. ప్రస్తుతం డీపీఆర్ తయారీకి నిధులు మంజూరు కావడంతో ప్రాజెక్టు కార్యరూపం దాల్చుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చివరి ఆయకట్టు రైతుల సాగుకష్టాలు తొలగనున్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**నీటి కష్టాలు తీరుతాయి**



పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణంతో చివరి ఆయకట్టు సాగునీటి కష్టాలు తీరుతాయి. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం డీపీఆర్ తయారీకి రూ.1.10 కోట్లు మంజూరు చేసింది. రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే పెద్దపల్లి నియోజకవర్గంతోపాటు ఉమ్మడి జిల్లా వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుంది.

– విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి

## మెడికల్ బోర్డులో కార్మికులకు అన్యాయం

- టీబీజీకేఎస్ ఇన్‌చార్జి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని: గతనెలలో నిర్వహించిన మెడికల్ బోర్డులో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనికి నిరసనగా సింగరేణిలో ఉద్యమాలు చేస్తామని టీబీజీకేఎస్ ఇన్‌చార్జి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 9 నెలల తర్వాత.. జూలై 30, 31న చేపట్టిన మెడికల్ బోర్డుకు 55 మందిని పిలిస్తే.. అందులో ఐదుగురినే అన్‌ఫిట్ చేయడం అన్యాయమన్నారు. ఇది గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల వైఫల్యమేనని ఆయన విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ వందశాతం మెడికల్ బోర్డులో ఉద్యోగాలివ్వాలని సూచించారని, ఇలా 19వేల మందికి ఉద్యోగాలిచ్చారని తెలిపారు. రాబోయే రోజుల్లో కారుణ్య నియామకాలు కనుమరుగైయ్యే పరిస్థితి కనబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణిలో మంత్రులు, ఎమ్మెల్యేల ఆధిపత్యమే నడుస్తోందని విమర్శించారు. టీబీజీకేస్ నాయకులను ఇబ్బంది పెట్టే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ బదిలీ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మందమర్రిలో ఎస్‌డీఎల్ యాక్టింగ్ ఆపరేటర్ రాచపల్లి శ్రావణ్‌కుమార్ మరణించడం దురదృష్టకరమన్నారు. మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధూకర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు మాదాసు రామమూర్తి, నూనె కొమురయ్య, వడ్డేపల్లి శంకర్, నాగెల్లి సాంబయ్య, వాసర్ల జోసఫ్, సురేందర్‌రెడ్డి, మేడిపల్లి సంపత్, చెల్పూరి సతీశ్, అన్వేష్‌రెడ్డి, చల్లా రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 5న పెద్దపల్లిలో ఇంటర్వ్యూలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మంథని ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న సివిల్ సర్జన్ (ఎంబీబీఎస్) 2 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు మంగళవారం(ఈనెల 5న) ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. ఆసక్తి, అర్హత గలవారు పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని, వివరాలకు 84990 61999, 94914 81481 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

## 'కిసాన్' సంబురం

- రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం
- ఒక్కో అన్నదాత అకౌంట్‌లో రూ.2వేల చొప్పున జమ



సుల్తానాబాద్(పెద్దపల్లి): చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఈఏడాది తొలివిడతలో నిధులు మంజూరు చేసింది. జిల్లాలోని అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో శనివారం నుంచి రూ.2వేల చొప్పున జమచేస్తోంది. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఏటా మూడు విడతల్లో (నాలుగు నెలలకోసారి) రూ.2 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. అయితే, ఈసారి వచ్చిన తొలివిడత డబ్బులు వరినాట్లకు ఉపయోగపడతాయని రైతులు భావిస్తున్నారు.

**జిల్లాలో తగ్గిన రైతుల సంఖ్య..**

జిల్లావ్యాప్తంగా 73,400 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో శనివారం నుంచి కిసాన్ సమ్మాన్ నిధులు జమచేస్తున్నారు. మొత్తం 82,219 మంది రైతులు ఉంటే.. అందులో 73,400 మందిని అర్హులుగా గుర్తించారు. ఐదెకరాల్లోపు వ్యవసాయ భూమి గల చిన్న, సన్నకారు రైతులు పథకానికి అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం 82,219 మంది రైతులకు 73,400 మందిని అర్హులుగా గుర్తించగా, మిగిలినవారి బ్యాంకు ఖాతాలు, ఆధార్ వివరాల్లో పొరపాట్లు ఉండడంతో అనర్హులుగా తేలారని అధికారులు చెబుతున్నారు. ఇలాంటివారి వివరాలు సక్రమంగా ఉంటే తమకు అందజేయాలని, తద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని వారు పేర్కొంటున్నారు.

**వివరాలు అందిస్తే అప్‌లోడ్ చేస్తాం**



ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా తొలివిడత నిధులు మంజూరయ్యాయి. జిల్లాలోని 73,400 మంది బ్యాంకు ఖాతాల్లో శనివారం నుంచి జమచేస్తున్నారు. నిధులు జమకానివారు బ్యాంకు ఖాతా నంబర్లు, ఆధార్ వివరాలు మాకు సమర్పించండి. ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం.

– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి

### మల్లన్నకు బోనం మొక్కులు



పట్నాలు వేయిస్తున్న భక్తులు

ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఓదెల మల్లన్నను దర్శించుకున్నారు. స్వామివారికి పట్నాలు వేయించి మొక్కులు చెల్లించుకున్నారు.

### ఆర్యవైశ్యుల వన భోజనాలు



వన భోజనాల్లో ఆర్యవైశ్యులు

ఎలిగేడు: రాములపల్లి(ర్యాకల్‌దేవుపల్లి) నాగలింగేశ్వర ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలతోపాటు స్నేహితుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. తొలుత ప్రత్యేకపూజలు చేశారు. పూజారి అభిషేక్‌శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకట్ నారాయణ, మంచాల జ్యోతి, కోలేటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### బీజీడీకేఎస్ డివిజన్ కార్యవర్గం



కొత్త కార్యవర్గ సభ్యులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): భారతీయ గ్రామీణ డాక్ కర్మచారి సంఘ్ పెద్దపల్లి డివిజన్ అధ్యక్షుడిగా ఎన్.మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో ఆదివారం సర్కిల్ కార్యదర్శి వినయ్ సుధీర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. కార్యదర్శిగా ఎం.సమ్మయ్య, కోశాధికారిగా కె.శ్రావణ్ కుమార్, డిప్యూటీ కార్యదర్శిగా బి.హరిహరన్ ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా నీట్ పీజీ ప్రవేశ పరీక్ష

రామగిరి(మంథని): సెంటినరీకాలనీలోని మంథని జేఎన్టీయూలో ఆదివారం నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 99 మంది విద్యార్థులకు 87 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. రామగిరి ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

# మూడు పంటలకు సాగునీరు



ఎత్తిపోతల ప్రారంభోత్సవంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల, దుద్దిళ్ల, అడ్లూరి, పొన్నం

- రామగుండాన్ని పరిశ్రమల కారిడార్‌గా అభివృద్ధి చేస్తాం
- అంతర్గాంలో గోదాములు నిర్మిస్తాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అభయం
- రామగుండం ఎత్తిపోతల ప్రారంభం
- ధర్మారంలో రేషన్‌కార్డులు పంపిణీ
- హాజరైన మంత్రులు తుమ్మల, దుద్దిళ్ల, పొన్నం, అడ్లూరి లక్ష్మణ్



సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, రైతులు



మహిళాశక్తి సంబురాల్లో మహిళలు

రామగుండం/ధర్మారం: రామగుండం ఎత్తిపోతలు అందుబాటులోకి రావడంతో ఏటా మూడు పంటలకు సాగునీరు అందుతుందని నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్గాం మండలం ముర్మూర్/బ్రాహ్మణపల్లి శివారులో రూ.75 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎత్తిపోతలను మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఆదివారం రిమోట్ సాయంతో ప్రారంభించారు. ధర్మారంలో రూ.45.15 కోట్లతో చేపట్టిన ఐటీఐ భవన సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, మంథని నియోజకవర్గంలో కాళేశ్వరం ప్రాజెక్టు, బ్యారేజీ, పంపుహౌస్‌లను రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో నిర్మించారని, అయినా, ఒక్కఎకరాకూ నీటిని వినియోగించుకోలేదన్నారు. రామగుండం నియోజకవర్గంలో 67 వేల రేషన్‌కార్డులు ఉంటే.. కొత్తగా 6,500 రేషన్‌కార్డులు జారీచేశామని మంత్రి తెలిపారు.

**పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేస్తాం..**

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, అనేక పరిశ్రమలకు నిలయమైన రామగుండాన్ని పారిశ్రామిక కారిడార్‌గా గుర్తించి అభివృద్ధి చేస్తామన్నారు. ఇందిరా మహిళాశక్తి సభ్యులకు ఆర్టీసీ బస్సు అప్పగించడం ద్వారా వారిని ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సింగరేణిలో కార్మికుల మారుపేర్ల సమస్య ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి గత ఎన్నికల సందర్భంగా ఇక్కడ బస్సుయాత్ర చేపట్టామన్నారు. ప్రతిపాదనలు పంపిస్తే అంతర్గాంలో గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మహాలక్ష్మి పథకం రామగుండం నియోజకవర్గంలో సంపూర్ణంగా అమలవుతోందన్నారు. ప్రయాణికుల అవసరం మేరకు మరో 16 బస్సులను కేటాయించాలని మక్కాన్‌సింగ్ కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

**ఎయిర్‌పోర్ట్ రాకుంటే..**

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ, అంతర్గాం భూముల్లో ఎయిర్‌పోర్ట్ రాకుంటే ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించారని, ఆయన అకాల మృతితో నిర్వాసిత గ్రామాలు, రామగుండం ఉమ్మడి మండలంలోని ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యం కార్యారూపం దాల్చలేదనే ఠాకూర్ గుర్తు చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, జిల్లాలో 2.40 లక్షల ఆయకట్టు ఉందని, దీనిని స్థిరీకరించేందుకు పత్తిపాక రిజర్వాయరే ఆధారమన్నారు.

**కాందిశీకుల సమస్యలు పరిష్కరించండి..**

ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు మాట్లాడుతూ, బర్మా, శ్రీలంక, కాందిశీకుల భూములు, పరిహారం సమస్యలు పరిష్కరించాలని మంత్రులను కోరారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ రవీందర్ పటేల్, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. ధర్మారంలో ఏర్పాటు చేసిన మరో కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పత్తిపాక శివారులో శ్రీలక్ష్మీనర్సింహస్వామి రిజర్వాయర్ నిర్మిస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినా అమలు చేయలేదని మండిపడ్డారు. ధర్మపురి ఎమ్మెల్యే, మంత్రి లక్ష్మణ్‌కుమార్ విన్నపం మేరకు తమ ప్రభుత్వం లక్ష్మీనర్సింహా రిజర్వాయర్ నిర్మాణం డీపీఆర్ తయారీ కోసం రూ.1.10కోట్లు కేటాయించిందని మంత్రి స్పష్టం చేశారు. రైతుల కోసం బొమ్మారెడ్డిపల్లి – కొత్తపల్లి మైనర్ కాలువ పెండింగ్ పనుల కోసం రూ.5కోట్లు, మేడారం రిజర్వాయర్ నుంచి డీ – 83 బీ లింక్ కెనాల్ పనుల పూర్తికి రూ.3.26 కోట్లు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు లావుడ్య రూప్లానాయక్, భీమ సంతోష్, బుర్ర రాములుగౌడ్, లక్ష్మణ్ లావణ్య, సివిల్ సప్లయ్ ఎండీ చౌహాన్, అదనపు కలెక్టర్ వేణు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

# 4 నెలలు.. 20 మిలియన్ టన్నులు

- సింగరేణిలో 97శాతం బొగ్గు ఉత్పత్తి
- అగ్రస్థానంలో ఆర్జీ–2 ఏరియా



గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో సింగరేణి పకడ్బందీగా ముందుకు సాగుతోంది. గత నాలుగు నెలల్లో 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే, జూలై నాటికి 20.81 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, 20.18మిలియన్ టన్నులు నమోదు చేసి నిర్దేశిత లక్ష్య సాధనలో 97 శాతం నమోదు చేసింది. జూలైలో వర్షాలు దంచి కొట్టినా.. అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించే ఓసీపీల్లో రవాణాకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టింది. ముందుగా ఏర్పాటు చేసుకున్న స్టాక్‌కోల్ నుంచి రైల్వే మార్గం ద్వారా వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు సరఫరా చేసింది. దీంతో ఉత్పత్తిలో లోటు పెద్దగా కనిపించడం లేదు. అయితే వర్షాలు అధికంగా కురవడంతో జూలైలో సంస్థవ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లో 87శాతం బొగ్గు ఉత్పత్తి మాత్రమే నమోదు చేయాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు.

**నంబర్ వన్‌గా ఆర్జీ–2 ఏరియా**

గత నాలుగు నెలల్లో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించి ఆర్జీ–2 ఏరియా అగ్రస్థానంలో నిలిచింది. 19.87లక్షల టన్నుల లక్ష్యానికి 26.57లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించి 134 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదు చేసింది. అలాగే 108 శాతంతో మణుగూరు ఏరియా రెండోస్థానంలో, 103 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి కొత్తగూడెం మూడోస్థానంలో నిలిచింది. మిగతా ఎనిమిది ఏరియాలు నిర్దేశిత లక్ష్య సాధనకు వెనుకబడ్డాయి. కేవలం 20 శాతం బొగ్గు ఉత్పత్తితో ఏపీఏ ఏరియా చివరి స్థానంలో నిచిలింది.

**4 నెలల్లో బొగ్గు ఉత్పత్తి(లక్షల టన్నుల్లో)**

| ఏరియా | లక్ష్యం | సాధించింది | శాతం |
|---|---|---|---|
| ఆర్జీ –1 | 15.14 | 12.60 | 83 |
| ఆర్జీ – 2 | 19.87 | 26.57 | 134 |
| ఆర్జీ – 3 | 20.70 | 18.16 | 88 |
| ఏపీఏ | 2.61 | 0.51 | 20 |
| భూపాలపల్లి | 14.19 | 10.91 | 77 |
| కొత్తగూడెం | 47.33 | 48.69 | 103 |
| ఇల్లెందు | 10.48 | 8.86 | 85 |
| మణుగూరు | 36.59 | 39.50 | 108 |
| బెల్లంపల్లి | 11.00 | 10.39 | 95 |
| మందమర్రి | 8.72 | 5.80 | 67 |
| శ్రీరాంపూర్ | 21.49 | 19.85 | 92 |

**ప్రణాళిక ప్రకారం ముందుకు**



ఉత్పత్తి లక్ష్య సాధనకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలి. వార్షిక లక్షానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. వర్షాకాలంలో ఉత్పత్తి తగ్గకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా ఓసీపీల్లో బొగ్గు రవాణాకు ఆటంకం లేకుండా చూడాలి. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సకాలంలో అందిస్తూ, ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలి.

– బలరాం, సీఎండీ, సింగరేణి

## క్లుప్తంగా

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


విద్యాసాగర్(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన బొల్లి విద్యాసాగర్(37) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాలు.. కొంతకాలంగా విద్యాసాగర్‌కు మానసిక పరిస్థితి సరిగా లేక మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 1న పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించగా, గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొంతుదూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు.

### ఎలిగేడులో ఒకరు..

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తీగల నరేశ్(32) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాలు.. నరేశ్ కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. రోజు తాగితే ఎలా అని ఈనెల 2న అతడి భార్య మమత మందలించగా మనస్తాపానికి గురయ్యాడు. అదేరోజు మధ్యాహ్నం 12గంటలకు గడ్డి మందు తాగానని చెప్పడంతో వెంటనే చికిత్సకోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రతిమ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. నరేశ్‌కు భార్యతోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

### కొడుకు చేతిలో గాయపడిన తండ్రి..


నర్సయ్య (ఫైల్)

రాయికల్: కొడుకు చేతిలో గాయపడిన పట్టణానికి చెందిన చిట్యాల లక్ష్మీనర్సయ్య (55) వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. గత నెల 29న నర్సయ్యపై ఆయన కొడుకు రాజేందర్ కత్తితో దాడి చేసిన విషయం తెల్సిందే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నర్సయ్యను జగిత్యాల.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చాతిలో తీవ్రమైన గాయాలు కావడంతో వైద్యులు ప్రయత్నించినా ఫలితంలేకుండా పోయింది. నర్సయ్యకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. నర్సయ్యపై దాడి చేసిన కొడుకు రాజేందర్‌తోపాటు సహకరించిన అస్లాంను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

### గుర్తుతెలియని మృతదేహం



కొత్తపల్లి(కరీంనగర్): చింతకుంట రెవెన్యూ పరిధిలోని ఎల్ఎండీ రిజర్వాయర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలినట్లు కొత్తపల్లి ఎస్సై సంజీవ్ తెలిపారు. 50–55 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వ్యక్తికి సంబంధించి ఆచూకీ తెలిస్తే కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.


➡ 'ఇతడి పేరు నగర్ల ప్రశాంత్. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామం. తల్లిదండ్రులు శ్రీనివాస్, రేణుక వ్యవసాయం చేస్తారు. ప్రశాంత్ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ పూర్తి చేశాడు. 2012 నుంచి 2024 వరకు 21 సార్లు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాడు. 2013 నుంచి 2015 వరకు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించాడు. హైదరాబాద్‌లో జరిగే టీజీ ప్రో కబడ్డీలో మూడు సార్లు పాల్గొని రూ.10 లక్షల బహుమతిని ఇతడి టీం సభ్యులు గెలుచున్నారు'.


➡ 'ఈయన పేరు పత్రి హరీశ్. వేములవాడ అర్బన్ మండలం అనుపురం. తల్లిదండ్రులు లక్ష్మి–గంగారం, నలుగురు అన్నదమ్ములు ఉన్నారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో 12 సార్లు, జాతీయస్థాయిలో ఒక సారి పాల్గొన్నాడు. డిగ్రీ వరకు చదివి తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సహాయ పడుతున్నాడు. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తే క్రీడల కోటాలో అవకాశం వస్తుందని ఎదురుచూస్తున్నాడు'.


➡ 'ఇతడి పేరు గుగ్లోతు తిరుపతి. వేములవాడరూరల్ మండలం నూకలమర్రి గ్రామం. తల్లిదండ్రులు రాజునాయక్, సావిత్రి, ముగ్గురు అక్కలు ఉన్నారు. చిన్నప్పటి నుంచి క్రీడల పట్ల ఆసక్తితో రాష్ట్రస్థాయిలో 10 సార్లు, జాతీయ స్థాయిలో 5 సార్లు పోటీల్లో పాల్గొన్నాడు. బీపీఈడీ పూర్తి చేసి ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నాడు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రీమియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాడు. ఆయనతో పాటు నూకలమర్రి గ్రామంలో దాదాపు 30 మంది వరకు కబడ్డీ క్రీడాకారులు ఉంటారు'.

# ఆటల పల్లె.. పతకాల ముల్లె

- జాతీయస్థాయిలో రాణిస్తున్న ఆయా గ్రామాల యువకులు
- ఉద్యోగాల కోసం ఎదురుచూపులు


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

వేములవాడరూరల్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలంలోని ఎదురుగట్ల, చెక్కపల్లి, నూకలమర్రి, అనుపురం గ్రామాలు క్రీడాకారులకు పెట్టింది పేరుగా నిలిచాయి. ఈ గ్రామాల నుంచి ఎందరో క్రీడాకారులు గ్రామీణస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఎలాంటి శిక్షణ లేకున్నా పాఠశాల స్థాయి నుండే క్రీడల్లో పాల్గొని మంచిపేరు తెచ్చుకున్నారు. ఇప్పటికీ కొంత మంది యువకులు క్రీడలపై ఆసక్తితో ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొని గ్రామీణ క్రీడలకు ఊపిరి పోస్తున్నారు. కబడ్డీ పోటీలంటేనే సదరు గ్రామాల యువకులు పాల్గొంటారని పేరుంది. కాగా, నూకలమర్రి గ్రామంలో చైతన్య యూత్ క్లబ్ పేరుతో క్రీడాకారులు యూత్‌గా ఏర్పడి ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తారు.

**ఉద్యోగాల కోసం నిరీక్షణ**

కబడ్డీ క్రీడపై ఎంతో ఆసక్తి ఉన్న యువకులు క్రీడల కోటాలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా, చాలా మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ వయస్సు దాటిపోయి ఉద్యోగాలకు అనర్హులుగా ఉండిపోతున్నారు. గ్రామాల్లో వ్యవసాయం, కుల వృత్తులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

**పంచాయతీలో కప్‌లు**

మండలంలోని ఎదురుగట్ల, చెక్కపల్లి, నూకలమర్రి గ్రామాల నుంచి కబడ్డీ పోటీల్లో పాల్గొని విజయం సాధించిన క్రీడాకారులు వారికి వచ్చిన కప్‌లను ఆయా గ్రామపంచాయతీల్లో భద్రంగా ఉంచుతారు. కాగా, కప్‌లను చూసి సంతోష పడడం తప్ప ఉద్యోగాలు మాత్రం రావడం లేదని ఆయా గ్రామాల క్రీడాకారులు నిరాశలో ఉన్నారు.

**పదుల సంఖ్యలో క్రీడాకారులు**

జిల్లాలోనే నూకలమర్రి, ఎదురుగట్ల, చెక్కపల్లి, అనుపురం క్రీడా గ్రామాలుగా పేరుపొందాయి. ఈ గ్రామాల నుంచి 30 ఏళ్లుగా ఎందరో క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. ప్రతీ గ్రామం నుంచి పదుల సంఖ్యలో కబడ్డీ క్రీడాకారులు ఉన్నారు. ప్రస్తుతం ఒకరిద్దరికి తప్ప మిగతా క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన దాఖలాలు లేవు.

## పెన్షన్ డబ్బులతో ప్రతిభా పురస్కారాలు

- విశ్రాంత ఏఈ మల్లేశం దాతృత్వం


జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస్‌కు డిపాజిట్ పత్రం అందజేస్తున్న మల్లేశం

సిరిసిల్లకల్చరల్: పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు ఓ విశ్రాంత ఉద్యోగి ముందుకొచ్చారు. తన పెన్షన్ డబ్బుల్లోంచి రూ.1.50లక్షల చొప్పున బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. వాటిపై వచ్చే వడ్డీ సొమ్ముతో ప్రతిభావంతులకు పురస్కారాలిచ్చేలా ఏర్పాట్లు చేశారు. సిరిసిల్లకు చెందిన కుసుమ రామయ్య పెద్దకుమారుడు మల్లేశం ఏఈగా ఉద్యోగ విరమణ చేశారు. తనకొచ్చిన పెన్షన్ డబ్బుల్లోంచి రూ.1.50లక్షల చొప్పున తాను చదువుకున్న శివనగర్ జెడ్పీ హైస్కూల్‌తోపాటు అగ్రహారంలోని పాలిటెక్నిక్ కళాశాలలకు అందజేశారు. వీటిపై వచ్చే వడ్డీ సొమ్ముతో ఏటా ప్రతిభ చూపే విద్యార్థులకు పురస్కారాలు ఇవ్వాలని ఆయా సంస్థల హెచ్‌ఎం, ప్రిన్సిపాళ్లకు సూచించారు. మరిన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇదే తరహా నిధి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

### సీఐడీ ఎస్సై సుమలతకు ఫొటోగ్రఫీలో స్వర్ణపతకం

కరీంనగర్‌క్రైం: తెలంగాణ రాష్ట్ర రెండో పోలీస్ డ్యూటీ మీట్–2025లో సీఐడీ కరీంనగర్ యూనిట్‌కు చెందిన ఎస్సై గుడాటి సుమలత ఫొటోగ్రఫీ విభాగంలో మొదటి స్థానం సాధించి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఈ పోటీలు జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు వరంగల్ జిల్లా మమునూర్‌లోని పోలీస్ శిక్షణా కేంద్రంలో నిర్వహించారు. నేర స్థలాల ఫొటోగ్రఫీలో ఎస్సై సుమలత ఉత్తమ ప్రదర్శన కనబరిచారు.

## స్వగ్రామానికి వలసజీవి మృతదేహం


అంజయ్య (ఫైల్)

మల్యాల(చొప్పదండి): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి గుండెపోటుతో మృతిచెందిన వలసజీవి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మల్యాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన బూస అంజయ్య(51) జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. జూలై 6న అక్కడే గుండెపోటుతో మృతి చెందాడు. దుబాయ్‌లో ఉన్న మృతుడి కుమారుడు బూస హరీశ్ తన తండ్రి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించాలని ముత్యంపేట మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొండపల్కల రాం మోహన్‌రావు, గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు గుండ్లపల్లి నరసింహ, ఉపాధ్యక్షుడు శేఖర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాడు. వారు కంపెనీ యాజమాన్యంతో సంప్రదించి, మృతదేహాన్ని ఆదివారం దుబాయ్ నుంచి ముత్యంపేటకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

## విస్తృత తనిఖీలు.. భారీగా వాహనాలు సీజ్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ పోలీసులు శనివారం అర్ధరాత్రి వరకు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నగరంలోని 20 ప్రధాన కూడళ్ల వద్ద దాదాపు 150 మంది పోలీసులతో నాఖాబందీ నిర్వహించి, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మొత్తం 151 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, ప్రివెంటివ్ చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారు, నంబర్ ప్లేట్ లేని, టాంపర్ చేసిన వాహనాలు, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నామని వివరించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 53 వాహనాలు, నంబర్ ప్లేట్ సరిగా లేని, టాంపర్ చేసినవి 80, సరైన ధ్రువపత్రాలు లేని 11 వాహనాలు, నంబర్ ప్లేట్ లేని వాహనాలు 7 సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు తమ వాహనాలను సరైన ధ్రువపత్రాలతో నిబంధనలకు అనుగుణంగా నడపాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లతిమ్మాపూర్ బస్టాండ్ సమీపంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు. వివరాలు.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం అక్కపూర్‌కు చెందిన మిర్యాల రాములు, గుంట నవీన్ ద్విచక్ర వాహనంపై ఎల్లారెడ్డిపేటకు వస్తున్నారు. ఈక్రమంలో రాచర్లగొల్లపల్లి నుంచి గంభీరావుపేటకు శ్రీగాథకు చెందిన చంద్, రాము ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలు కాగా, నవీన్ పరిస్థితి విషమంగా ఉంది. కాగా, ఈ ప్రాంతంలోనే తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

**ఓదెల మండల పరిధిలో..**

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని ఇందుర్తి ఎక్స్‌రోడ్డు వద్ద ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గోదావరిఖనిలో ఉంటున్న సంపత్ ఆదివారం తన చిన్నాన్న సంవత్సరికానికి స్వగ్రామం గూడెం వచ్చాడు. అనంతరం తన కూతురును హైదరాబాద్ పంపించేందుకు పొత్కపల్లి రైల్వేస్టేషన్‌కు బైక్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో పొత్కపల్లి నుంచి జమ్మికుంటకు బైక్‌పై వెళ్తున్న వీణవంక గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అకస్మాత్తుగా ఢీకొట్టడంతో సంపత్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్సకోసం జమ్మికుంటకు తీసుకెళ్లగా, పరిస్థితి విషమించడంతో హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు.

### గంజాయి విక్రేతలపై కేసు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. మండల కేంద్రం శివారులో ఆదివారం అనుమానాస్పదంగా సంచరిస్తున్న బద్దెనపల్లికి చెందిన ఎండీ సమీర్, టి.రాజేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా అమ్మేందుకు తీసుకువచ్చిన 120 గ్రాముల గంజాయి లభ్యమయ్యింది. గంజాయిని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మహిళను కాపాడిన లేక్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: మానేరుడ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన గన్నేరువరంకు చెందిన ముమ్మత్ ఫాజియా (25)ను లేక్ ఔట్ పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు ఎంఏ హఫీజ్ బేగ్ కాపాడారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ అందించి పంపించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు అతడిని అభినందించారు.

## రసాభాసగా అర్బన్ బ్యాంకు సమావేశం


అధ్యక్షుడు విలాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ మధ్య వాగ్వాదం

- గత పాలకవర్గ సభ్యత్వాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటన
- అంతా చట్టప్రకారమే జరిగిందన్న మాజీ అధ్యక్షుడు

కరీంనగర్‌అర్బన్: కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు సమావేశం రసాభాసాగా సాగింది. కొంతకాలంగా అంతర్గతంగా ఉప్పు నిప్పులా ఉన్న వైరం ఆదివారం రెవెన్యూ గార్డెన్ వేదికగా బయటపడింది. గత పాలకవర్గం, ప్రస్తుత పాలకవర్గానికి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇటీవల టీఎన్జీవో భవన్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో కోరం లేదని ఈ నెల 3కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సమావేశ ఆరంభంలో బ్యాంకు చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి హైకోర్టు తీర్పు ప్రతంటూ చూపిస్తూ వాటి సారాంశాన్ని వివరించారు. గత పాలకవర్గాల తీరు నిబంధనలకు విరుద్ధమని, కోరం లేకుండా ఎన్నో తప్పులు చేశారని ఆరోపించారు. దీంతో మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి అక్రమాలు జరగలేదని అధికారుల కనుసన్నల్లో సమావేశాలు జరిగాయని, కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెరవెనుక ఎవరున్నారో తెలుసని, ఎవరికీ భయపడేదిలేదన్నారు. దీనివెనుక రాజకీయ కోణం ఉందని, ఎవరెవరు చేస్తున్నారు, ఎందుకు చేస్తున్నారో తెలుసని ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే తనతో పోటీపడి గెలవాలని, తగ్గేదే లేదని స్పష్టం చేశారు.

**15మంది సభ్యుల శాశ్వత తొలగింపు**

సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. 2007–17 వరకు ఉన్న పాలకవర్గ సభ్యులు కర్ర రాజశేఖర్, ఎండీ సమియుద్దీన్, ఇ.లక్ష్మణరాజు, వరాల జ్యోతి, దేశ వేదాద్రి, అనరాసు కుమార్, కె.రవి, సరిల్ల ప్రసాద్, వజీర్ అహ్మద్, తాటికొండ భాస్కర్, బాశెట్టి కిషన్, బొమ్మరాతి సాయికృష్ణ, దునిగంటి సంపత్, తాడ వీరారెడ్డి, ముద్దసాని క్రాంతిలను బ్యాంకు సభ్యత్వం నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు సభ ఆమోదం తెలుపగా చైర్మన్ విలాస్‌రెడ్డి ప్రకటించారు. సమావేశంలో బ్యాంకు సీఈవో నుసుగొండ శ్రీనివాస్, సభ్యులు మడుపు మోహన్, ముక్క భాస్కర్, రేగొండ సందీప్, మూల లక్ష్మి, విద్యాసాగర్, మంగి రవీందర్, నాగుల సతీశ్, రాజు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నోలో స్నేహితుల దినోత్సవం


వేడుకల్లో ఉపాధ్యాయులతో నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులతో విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. స్నేహితుల ద్వారా ఆనందంతో పాటు సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఆపదకు ఆపన్నహస్తంగా స్నేహితులు నిలుస్తారని, నేటి పోటీ ప్రపంచంలో సమయభావం వల్ల చాలామంది స్నేహితులు దూరమవుతున్నారని, వారితో సంప్రదింపులకు సైతం సమయం కేటాయించకపోవడం విచారకమని పేర్కొన్నారు. తరతరాల నుంచి వస్తున్నటువంటి స్నేహబంధ వైవిధ్యాన్ని, గొప్పతనాన్ని, విశిష్టతను ప్రతిఒక్కరూ పాటిస్తూ, స్నేహబంధంలో నైతిక విలువలను అమలు చేస్తూ ఆదర్శంగా నిలవాలని కోరారు. వేడుకల్లో భాగంగా నరేందర్‌రెడ్డికి ఉపాధ్యాయులు ఫ్రెండ్‌షిప్ రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

# దళారీ బెడద లేదిక!

- విత్తనోత్పత్తిలో నూతన ప్రక్రియకు శ్రీకారం
- మంత్రి ఆదేశాలు అమలైతే అన్నదాతకు మేలు



కరీంనగర్ అర్బన్: విత్తనోత్పత్తిలో దళారీ బెడద లేకుండా నేరుగా కంపెనీలే రైతులతో సంబంధాలు పెట్టుకోవాలన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటన అన్నదాతల్లో ఆనందం నింపుతోంది. సదరు ఆదేశాలు అమలైతే రైతులకు గిట్టుబాటు ధర రానుండగా, కంపెనీలకు మేలు చేకూరనుంది. ఏటా రూ.వందల కోట్ల వ్యాపారం సాగుతుండగా విత్తనాలకు డిమాండ్ లేదంటూ రైతులను మోసగిస్తున్న ఘటనలు అనేకం.

**ఆర్గనైజర్లతోనే రైతులకు నష్టం**

విత్తనోత్పత్తిలో దక్షిణ ఆమెరికా తరువాత తెలంగాణ అత్యంత అనువైన ప్రాంతమన్నది శాస్త్రవేత్తల మాట. అందులో ఉత్తర తెలంగాణ మరింత అనువైనదని గుర్తించారు. ప్రధానంగా పంట కోత సమయంలో అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ చీడపీడల బెడద, గాలిలో తక్కువ తేమశాతం, నేలల్లో పొటాష్ పోషక సమతౌల్యం, సాగునీటి లభ్యత ఉండటం వంటి అంశాలు విత్తనోత్పత్తికి ఉపయోగకరంగా ఉండటంతో కంపెనీలు కరీంనగర్‌పై కన్నేశాయి. ఆర్గనైజర్ల ద్వారా జిల్లాలో రైతుల శ్రమతో ఆటలాడుతున్నాయి. పలు రకాల విత్తనాలను సాగు చేయించి ముందొక మాట దిగుబడి తదుపరి మరో ధర చెల్లిస్తూ నిలువునా దోచుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో చాలాచోట్ల డబ్బులు ఎగవేసిన సందర్భాలున్నాయి. విత్తనోత్పత్తి వ్యవస్థలో ఆర్థికంగా బాగుపడిన రైతుల సంఖ్య పదిశాతం ఉంటే, మధ్యవర్తులుగా ఉండి రూ.కోట్లకు పడగలెత్తిన వారి సంఖ్య వందశాతం ఉంది. ప్రధాన ఆర్గనైజర్లు ఊరూరా వందల సంఖ్యలో సబ్ ఆర్గనైజర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఆర్గనైజర్లతో రైతులకు నేరుగా ఒప్పందాలు లేవు. దస్త్రాల్లో రైతుల వివరాలు మాత్రమే నమోదు చేసుకుంటారు. రైతులకు ఇచ్చే ప్రతి రూపాయికి బాధ్యులుగా సబ్ ఆర్గనైజర్లు ఉంటున్నారు.

**హైబ్రిడ్, సూటి రకాల్లో చేతివాటం**

జిల్లాలో 65వరకు సూటి వరి విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా, నిజామాబాద్ జిల్లాకు చెందిన మొక్కజొన్న విత్తన కంపెనీలు, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన జొన్న, సజ్జ సంస్థలు జిల్లాలో విత్తనోత్పత్తి చేయిస్తున్నాయి. భారత వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలోని కృషి విజ్ఞాన కేంద్రం, పరిశోధన స్థానాలు, ఏరువాక కేంద్రాలు, వ్యవసాయశాఖ గ్రామీణ విత్తనోత్పత్తి కేంద్రం వంటి వాటి ద్వారా సూటి రకాల్లో విత్తనోత్పత్తి చేయిస్తున్నారు. సూటిరకాల్లో రైతులకు పెద్దగా మోసాలు జరగకపోయినా హైబ్రిడ్ విత్తనోత్పత్తిలోనే తీవ్రంగా మోసపోతున్న ఉదంతాలున్నాయి. ప్రధానంగా రైతులు అమాయకంగా సంస్థల సూచనలు పాటిస్తుండటం .. వ్యవసాయ శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో హైబ్రిడ్ విత్తన ఉత్పత్తిలో ప్రయివేటు సంస్థలదే పెత్తనంగా మారింది. గతంలో మెట్‌పల్లి, కోరుట్ల, మానకొండూరు, హుజూరాబాద్ ప్రాంతాల రైతులతో పలువురు ఏజెంట్లు పలు విత్తనాలు ఉత్పత్తి చేయించి పంట తీసుకెళ్లాక సంస్థలు రైతులు చెల్లింపులు చేయకుండా మోసగించాయి. దీంతో ప్రభుత్వమే రైతులకు రూ.10కోట్ల వరకు పరిహారం చెల్లించాల్సి వచ్చింది. అంతకుముందు జమ్మికుంట ప్రాంతంలో బీపీటీ సూటిరకానికి క్వింటాల్‌కు రూ.1800పైగా ధర చెల్లిస్తామని విత్తన కంపెనీ సంస్థలు పంట పండిన తరువాత రూ.200 తగ్గించడంతో రైతులు ఆందోళన చేపట్టారు.





## శివయ్యా... దండాలయ్యా



వేములవాడ: 'శివయ్యా.. మా కష్టాలు తీర్చయ్యా'.. అంటూ వివిధ ప్రాంతాలకు చెందిన 35 వేల మంది భక్తులు ఆదివారం రాజన్నను దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నను మహారాష్ట్ర రాష్ట్ర రవాణా కమిషనర్ వివేక్ భీమన్వార్ (ఐఏఎస్) ఆదివారం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారికి రూ.30 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈవో రాధాబాయి, ఏఈవోలు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీఎఫ్ సిబ్బంది, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.